నేతల కబంధ హస్తాల్లో

వెండింగ్ జోన్

- షాపులను పంచేసుకున్నారు.. దందాలు కొనసాగిస్తున్నారు..
- అద్దెలకు ఇస్తూ అందినకాడికి దండుకుంటున్న నేతలు..
- అలాట్‌మెంట్ లెటర్లు లేకున్నా కరెంటు మీటర్లు


సాధారణ రోజుల్లో కొనసాగుతున్న వ్యాపారాలు




సనత్‌నగర్ ప్రధాన రహదారిలో ఇండస్ట్రియల్ పార్కు వద్ద వెండింగ్ జోన్ ముందు సండే మార్కెట్

సనత్‌నగర్: దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు కొంతమంది నేతలు జీహెచ్‌ఎంసీ వెండింగ్ జోన్‌లోని షాపులు పంచుకున్నారు. షాపులను తమ ఆధీనంలో ఉంచుకోవడంతో పాటు తమ సొంత జాగీరు అన్నట్లుగా అద్దెలకు ఇచ్చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారికంగా ఇంతవరకు ఎవరికీ ఎలాంటి కేటాయింపులు జరపలేదు. అయినా కొంత మంది నేతలు ఆ షాపులపై ఆధిపత్యం సాగిస్తూ తమకిష్టమైన వారికి అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ నిధులతో వెండింగ్ జోన్ నిర్మాణం జరిపితే..అర్హులను పక్కనబెట్టి నాయకులు అనుభవిస్తున్నారు. ఇదీ సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కు ప్రహరీని ఆనుకుని ప్రధాన రహదారిలో నిర్మించిన వెండింగ్ జోన్ పరిస్థితి. ప్రజలకు అవసరమైన రోజువారీ నిత్యావసరాలను ఒకే గొడుగు కిందికి తీసుకురావడంతో పాటు చిరువ్యాపారులకు ఊతమందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వ హయాంలో జీహెచ్‌ఎంసీ వెండింగ్ జోన్లకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సనత్‌నగర్ ప్రధాన రహదారిలో ఇండస్ట్రియల్ పార్కును ఆనుకుని 18 షాపులను నిర్మించింది.

చిరువ్యాపారులకు సంబంధం లేని వ్యక్తుల చేతుల్లో..

వాస్తవంగా స్ట్రీట్ వెండింగ్ కార్డు కలిగిన అర్హులకు ఈ షాపులను కేటాయించాలి. కానీ 18 షాపుల్లో ఏ ఒక్కటైనా అర్హత కలిగిన వారికి దక్కిందా? అంటే లేదనే చెప్పాలి. అసలు అధికారికంగా ఎవరికీ కేటాయింపులు జరపలేదు. జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అలాట్‌మెంట్ లెటర్లు ఇంతవరకు ఇవ్వలేదు. నాయకులే అన్నీ తామై ఎవరికి వారు పంచుకున్నారు. చిరువ్యాపారులకు ఇస్తామంటూ తమ ఆధీనంలోకి తీసుకున్న నేతలు..ఇప్పుడు అద్దెల రూపంలో అదే చిరువ్యాపారుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు. ఎంతగా అంటే ఆదివారం వచ్చిందంటే ఇక్కడ జరిగే అంగడి వ్యాపారులకు కూడా కిరాయిలకు ఇచ్చుకుంటున్నారు. ఇటీవల వచ్చిన దీపావళి పండుగ అయితే ఈ షాపులే వారికి భారీగా కాసులు కురిపించాయి. లక్ష్యానికి విరుద్ధంగా ఇక్కడ పానీపూరీ, ఫర్నీచర్, ఫాస్ట్‌ఫుడ్ ఇతర ఫుడ్‌కోర్టు సెంటర్లు ఇక్కడ వెలిశాయి. వాస్తవంగా తోపుడుబండ్ల వ్యాపారులకు, వీధి వ్యాపారులకు వీటిని కేటాయించడం ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం చేసుకుని వెళ్లిపోవాలి. కానీ ఇక్కడ స్థిరమైన వ్యాపార కేంద్రాలుగా వీటిని మార్చేశారు.

కరెంటు మీటర్లు ఎలా వచ్చేనో...?

స్ట్రీట్ వెండింగ్ జోన్‌లో కరెంటు అవసరం లేకుండానే తమ వ్యాపారాలు నిర్వహించుకునేవిధంగా షాపులను నిర్మించి తదనుగుణంగా మార్గనిర్దేశకాలు రూపొందించారు. కానీ ఇక్కడ కరెంటు మీటర్లు రావడం వెనుక రాజకీయ నాయకులు ఏవిధంగా పాచికలు కదుపుతున్నారో అర్థమవుతుంది. వాస్తవంగా అర్హులకు కేటాయిస్తున్నట్లుగా జీహెచ్‌ఎంసీ అందజేసిన అలాట్‌మెంట్ పత్రం ఉండాలి, దాని ఆధారంగా కరెంటు మీటర్లకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి అలాట్‌మెంట్ లెటర్లు ఇవ్వలేదని ఓ అధికారి చెప్పుకొచ్చారు. అలాంటప్పుడు కరెంటు మీటర్లు ఎలా ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది. కేవలం నాయకులే గతంలో వెండింగ్ కార్డులు కలిగిన వారిని ముందు చూపించి కేవలం ఆ వెండింగ్‌కార్డు ఆధారంగా కరెంటు మీటర్లు ఎలా ఇస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి.

జీహెచ్‌ఎంసీ అలాట్‌మెంట్ లెటర్ ఉంటేనే..

జీహెచ్‌ఎంసీ అధికారికంగా అలాట్‌మెంట్ లెటర్ ఉంటే కరెంటు మీటర్లు ఇవ్వవచ్చు. అయితే మూడు రెట్లు అధికంగా సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే కరెంటు మీటర్లు ఏ ప్రాతిపదికన జారీ చేశారో పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– విద్యుత్ శాఖ ఏడీఈ వంశీకృష్ణ

అనర్హులు ఉంటే తొలగిస్తాం

వెండింగ్ జోన్ అనేది చిరువ్యాపారాలను లక్ష్యంగా చేసుకుని నిర్మించింది. అర్హులైన వారే ఇందులో ఉండాలి. జీహెచ్‌ఎంసీ మార్గదర్శకాల ప్రకారం ఎవరైనా అనర్హులు ఉన్నా గానీ, నిబంధనలకు విరుద్ధంగా ఇతర వ్యాపారాలు చేసుకుంటున్నా గానీ వాటిని తొలగిస్తాం. దీనిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటాం.

– జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ డీసీ రజనీకాంత్‌రెడ్డి

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కృపాప్రసాద్


కృపాప్రసాద్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన పెర్క కృపాప్రసాద్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో కృపాప్రసాద్ విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కృపాప్రసాద్ యువజన కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించిన కృపాప్రసాద్ గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చూస్తూ పేదల వర్గాలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తానని చెప్పారు.

విజయపథంలో రేవంత్ ప్రజాపాలన


సభలో మాట్లాడుతున్న ఆదం సంతోష్‌కుమార్

లాలాపేట: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం లాలాపేటలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాది ప్రజాపాలన విజయపథంలో నడుస్తోందన్నారు. తార్నాక డివిజన్ అధ్యక్షుడు నేతికార్ బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జీడి అమర్‌నాథ్ గౌడ్, వాజిద్, దరువు ఎల్లన్న, రవి, చక్రం, సందీప్, శేఖర్, కిషోర్, చింతల్ కిట్టు, బాబా అశోక్, తదితరులున్నారు.

మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

అమీర్‌పేట: అమీర్‌పేట మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకులు ఉత్తమ్‌కుమార్ కుటుంబ సభ్యులను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. ఉత్తమ్ కుమార్ సుమిత్ర గురువారం ఆకస్మికంగా మృతి చెందగా విషయం తెలుసుకున్న తలసాని లీలానగర్‌లోని ఉత్తమ్ నివాసానికి వెళ్లి పరామర్శించి తన ప్రగాఢ సంతాపం,సానుభూతి తెలిపారు.ఎమ్మెల్యే వెంట పార్టీ నేతలు కూతురు నర్సింహ,కట్ట బల్‌రాం ఉన్నారు.

పవర్ బోర్ పనులు ప్రారంభం


పవర్‌బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. తిరుమలగిరి లాలామీయ బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి నివారణకు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టే పవర్‌బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు నెలల క్రితం లాలామీయ బస్తీలో పర్యటించిన సందర్భంలో స్థానికులు నీటి సమస్యతో పాటు పలు సమస్యలను వివరించారని ముందుగా నీటి ఎద్దడి నివారణకు పవర్‌బోర్‌వెల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గత వారం రోజుల్లో నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పవర్‌బోర్‌వెల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పవర్‌బోర్‌వెల్ ఏర్పాటు చేయడంతో స్థానికులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

లాలాపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న నిర్వహించతలపెట్టిన ఆటో, క్యాబ్ బంద్‌ను విజయంతం చేయాలనీ జై భీమ్ ఆటో రిక్షా ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ మల్లికార్జున్ కోరారు. బంద్‌కు సంబంధించిన ఫ్లెక్స్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనధికారికంగా కొనసాగుతున్న ఓలా, ఊబెర్‌లను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో జై భీమ్ ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు ఎం. మహేశ్, వై. కేశవ్, మధు, పి. నర్సింగరావు, నరేష్‌కుమార్, పులి రాజు, నరసింహా తదితరులున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన సందర్భంగా గురువారం ఆదయ్య మెమోరియల్ హైస్కూల్‌లో విద్యార్థులకు బాగులు, పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజలపై ప్రభుత్వానికున్న మమకారాన్ని చాటుకుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏమన్ సింగ్ ఠాకూర్, నాగరాజు, వినోద్, చందు, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘సక్సెస్ అన్‌లిమిటెడ్’పై రేపు సదస్సు

సనత్‌నగర్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న భారతీయ విద్యాభవన్‌లో ‘సక్సెస్ అన్‌లిమిటెడ్’పై జాతీయ స్థాయి సదస్సును నిర్వహించనున్నారు. బేగంపేట చిన్మయ మిషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మిషన్ అధ్యక్షుడు రామచంద్రమూర్తి, చీఫ్ సేవక్ రవీందర్‌లు ఆవిష్కరించారు. మిషన్ గ్లోబల్‌హెడ్ స్వరూపానంద సాయంత్రం 6.30 నుంచిప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.

విషమంగానే బాలుడి పరిస్థితి

రాంగోపాల్‌పేట్: ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ (8) పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. బుధవారం రాత్రి సంధ్య థియేటర్‌లో ప్రదర్శించిన పుష్ప–2 ప్రీ రిలీజ్ షోకు దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన భాస్కర్ ఆయన భార్య రేవతి, కుమారుడు తేజ, కుమార్తె సన్వీకతో కలిసి సినిమా చూసేందుకు రాగా తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భాస్కర్ భార్య రేవతి చనిపోగా కుమారుడు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


బండమైసమ్మనగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: బండమైసమ్మనగర్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై ఆ పనులు సాఫీగా ముందుకు సాగేందుకు సహకరించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ బస్తీలో స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. రూ. 71లక్షల వ్యయంతో వేస్తున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానిక బస్తీలో పర్యటించి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిర్మాణం కంటే ముందుగా డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ పనులను పూర్తి చేశామన్నారు. నూతన సీసీ రోడ్డు నిర్మాణం వల్ల స్థానిక ప్రజలకు రాకపోకలు ఎంతో సులువవుతాయన్నారు.

బండమైసమ్మనగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంతో పాటు లక్షలాది రూపాయల వ్యయంతో అనేక ప్రజాభివృద్ధి పనులను అమలు చేశామని గుర్తు చేశారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోయే విధంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జలమండలి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, వెంకటేశన్, వెంకట్, అబ్బాస్‌లతో పాటు స్థానిక బస్తీ నాయకులు పాల్గొన్నారు.

ఓయూ డైరీలో కాంట్రాక్టు అధ్యాపకుల పేర్లు చేర్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ముద్రించనున్న 2025 డైరీలో పర్మనెంట్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పేర్లు, సెల్ నంబర్లను చేర్చాలని ఔటా–సి అధ్యక్షులు డా.పరుశరాం వీసీ ప్రొ.కుమార్‌ను కోరారు. ఓయూలో 450 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పని చేస్తున్నారని, బోధన, పరీక్షల నిర్వహణ, జవాబుపత్రాల వాల్యూయేషన్‌తో పాటు పాలన పదవుల్లో సైతం కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఓయూ జిల్లా పీజీ కేంద్రాలలో ప్రిన్సిపల్స్ పదవుల్లో సైతం కొనసాగుతున్నారని పేర్కొన్నారు. సమాచారం కోసం రూపొందించే ఓయూలో డైరీలో కాంట్రాక్టు అధ్యాపకుల పేర్లు లేనందున విద్యార్థులు, కాలేజీలు, ఇతరులు ఇబ్బందులు పడుతున్నారని వీసీ ప్రొ.కుమార్ ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని డైరీలో కాంట్రాక్టు అధ్యాపకుల పేర్లు, సెల్ నంబర్లను వేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


బియ్యం తరలిస్తున్న వ్యక్తులను, బియ్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

బన్సీలాల్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇరువురిని గాంధీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి భారీ ఎత్తున బియ్యం, ఆటోను సీజ్ చేసిన పోలీసులు. గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం...ముషీరాబాద్ బోలక్‌పూర్, ఫిష్ మార్కెట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సలావుద్దీన్(29), మహ్మద్ పాషా(30)లను రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు కేసులో అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులు వివిధ రేషన్ షాపు నుంచి అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితులు ఆటోలో బన్సీలాల్‌పేట్ ప్రాంతం నుంచి వెళ్తుండగా అనుమానం వచ్చి తమ పోలీసులు ప్రశ్నించగా గుట్టురట్టయినట్లు తెలియజేశారు. నిందితుల నుంచి 1,360 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గాంధీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం


డీసీపీ రష్మీ పెరుమాళ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశాల్‌సూదం

సనత్‌నగర్: శాంతి భద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకంగా మారిందని నార్త్‌జోన్ డీసీపీ రష్మీపెరుమాళ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడిచిన సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘ప్రజా పాలన–ప్రజా విజయోత్సవం’లో భాగంగా బేగంపేట మోతీలాల్‌నెహ్రూనగర్, ఎస్‌బీఐ కాలనీల్లో ఏర్పాటుచేసిన 27 సీసీ కెమెరాలను గురువారం డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయనడంలో సందేహం లేదన్నారు. అత్యంత క్లిష్టమైన కేసులను కూడా సీసీ కెమెరాల ఆధారంగా నేడు ఛేదించగలుగుతున్నామన్నారు. మోతీలాల్‌నెహ్రూనగర్, ఎస్‌బీఐ కాలనీల అసోసియేషన్లు ముందుకువచ్చి శాంతిభద్రత పరిరక్షణలో తమ వంతు భాగస్వామ్యం అందిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్, సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సూదం బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్య, ఎస్ఐ శ్రీధర్, కాలనీ అధ్యక్షులు రవీంద్ర, జయశ్రీ, చంద్రశేఖర్, శ్రీశైలం, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంకకు కోట నీలిమ శుభాకాంక్షలు



సనత్‌నగర్: వయనాడ్ పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికైన ప్రియాంకగాంధీకి కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీలోని 10 జన్‌పథ్‌లోని ప్రియాంక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కోట నీలిమ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

స్థానిక సమస్యలు తెలుసుకున్న మాజీ కార్పొరేటర్

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం, స్వరూప గౌడ్ మాట్లాడుతూ అశోక్ నగర్ బస్తీ ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం మంచినీటి పైప్‌లైన్లను నిర్మించి గుంతలు ఇప్పటివరకు పూడ్చలేదన్నారు. దీంతో రహదారి పూర్తిగా గుంతలమయంలో మారడంతో వరద నీరు చేరడంతో అక్కడ బురదమయంగా మారిందన్నారు. పాదయాత్రలో బీజేపీ నాయకులు రవిప్రసాద్‌గౌడ్, ఓం ప్రకాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయి



జింఖానా మైదానంలో 2 కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ఏడాదిగా జనరంజకమైన పాలనను అందజేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో పేరుప్రఖ్యాతులను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక రాద్ధాంతం చేస్తున్నాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ జింఖానా మైదానంలో గురువారం 2కే రన్ నిర్వహించారు. ప్రజా పాలకులు, వివిధ ప్రభుత్వ విభాగం అధికారులు పాల్గొన్న ఈ రన్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిప్యూటి డైరెక్టర్ అనూష, డీపీఆర్‌వో కలీం, డివైఎస్‌వో సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యలకు తక్షణ పరిష్కారం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో మురుగునీటి సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. గురువారం వారసిగూడ, సీతాఫల్‌మండి, బ్రాహ్మణబస్తీ ప్రాంతాల్లోని మురుగు నీరు కాలువల్లో పూడిగమట్టి తొలగింపు పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాల్వల నుంచి మురుగునీరు ఓవర్ ఫ్లో కాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. మురుగునీటి కాల్వల నుంచి మట్టి తొలగింపుతో పాటు, డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లైన్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించామన్నారు. మురుగునీటి కాల్వల ద్వారా నెలకొని ఉన్న తాగునీటి పైప్‌లైన్లు కలుషితం కాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులకు కాల్వల పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సెక్షన్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ బాక్సింగ్ పోటీల విజేతలు


విజేతలతో ప్రొఫెసర్లు రాజ్‌కుమార్, దిప్లా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బాక్సింగ్ పోటీల విజేతల పేర్లను ప్రకటించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్ కుమార్, ఐయూటీ సెక్రెటరీ ప్రొ.దిప్లా విజేతల పేర్లను ప్రకటించారు. యూనివర్సిటీ పరిధిలోని నిజాం కాలేజీలో ఈ నెల 3, 4 తేదీలలో జరిగిన ఓయూ అంతర్ కళాశాలల బాల, బాలికల బాక్సింగ్ పోటీలలో 40 కాలేజీలకు చెందిన 150 మంది బాక్సర్లు పాల్గొనగా అన్వర్– ఉలూమ్ డిగ్రీ కాలేజీ ఛాంపియన్‌షిప్‌ను సాధించిన్నట్లు తెలిపారు.

దేవుళ్లను రాజకీయాలకు వాడుకోవద్దు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: దేవుళ్ల పేరిట రాజకీయాలు చేస్తూ అపోహలు పుట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. తాడ్‌బంద్ దేవాలయ దర్శన వేళల్లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. కొన్ని రోజులుగా ఈ విషయంలో దుష్ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవన్నారు. దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం. రాధాకృష్ణ రావు, దేవాలయ ఈఓ నరేందర్, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కాలంలో దేవాలయాల పేరిట రాజకీయం చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి చర్యలు పాల్పడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా తమ సర్కారు పోలీసులను ఆదేశించిందన్నారు.

సాంప్రదాయానుసారమే ఆలయ వేళలు..

భక్తుల మనోభావాలకు అనుగుణంగా తాడ్‌బంద్ దేవాలయ సందర్శన వేళల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం. రాధాకృష్ణ రావు ప్రకటించారు. ఎన్నోఏళ్లుగా ప్రతి శనివారం తాడ్‌బంద్ దేవాలయం రాత్రి ఒంటి గంట వరకు తెరిచి ఉంటుందన్నారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి ఇటీవల దేవాలయాన్ని సందర్శించి ఆలయ సందర్శన వేళల్లో మార్పులు సూచించినట్లు తెలిపారు.

◆ తదనుగుణంగా రాత్రి 10 గంటలకు గర్భాలయ ద్వారం మూసివేయనున్నట్లు అధికారులు నోటీసు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై భక్తులు తీవ్ర అభ్యంతరం తెలుపడంతో గతంలో మాదిరిగానే ప్రతి శనివారం రాత్రి ఒంటి గంట వరకు దేవాలయాన్ని తెరిచి ఉంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. దేవాలయ పాలకమండలి ఏర్పాటుపై ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందన్నారు. తాడ్‌బంద్ దేవాలయ స్థానిక ఆవరణలో అవకతవకలపై వస్తున్న ఆరోపణల విషయంలో విచారణ చేయిస్తామన్నారు.

‘విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు’


విద్యుత్ అధికారులకు సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

పద్మారావునగర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ) ఎల్. గోపయ్య, డివిజనల్ ఇంజనీర్ బ్రహ్మానందం అన్నారు. పద్మారావునగర్ డీఈ కార్యాలయం ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఈ గోపయ్య, డీఈ బ్రహ్మానందం మాట్లాడారు. విద్యుత్తు పరమైన సమస్యలపై వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మెన్ లలితా, ఫైనాన్స్ మెంబర్ శోభ, సభ్యులు అనిల్‌రెడ్డితో పాటు ఏడీఈ దుర్గాప్రసాద్, వివిధ సెక్షన్ కార్యాలయాలకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.